

108లో సుఖ ప్రసవం 8లో

పురుటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చింది.



జాతర ఏర్పాట్లు పరిశీలన

మన్యం కొండ జాతర ఏర్పాట్లను ఒడిశాకు చెందిన సబ్ కలెక్టర్ అక్షయ్‌కుమార్, ఉన్నతాధికారులు పరిశీలించారు. 8లో

నిండు గర్భిణికి కౌన్సెలింగ్



ఆస్పత్రిలో ప్రసవానికి నిరాకరించిన పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణికి ఎట్టకేలకు కౌన్సెలింగ్ నిర్వహించి తరలించారు. 8లో

న్యూస్‌రీల్

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా



రాజవొమ్మంగి నడిబొడ్డునుంచి ట్రాక్టర్‌పై తరలిపోతున్న విలువైన మారుజాతి కలప

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగి మీదుగా ప్రతి రోజూ విలువైన మారుజాతి కలప తరలిపోతోంది. దీనిపై సంబంధిత అటవీ అధికారులకు సమాచారం అందినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం రాజవొమ్మంగి నడిబొడ్డు నుంచి ఓ ట్రాక్టర్‌పై మారుజాతి కలపను తరలించారు. ప్రతిరోజూ ఇదే పరిస్థితి. సంబంధిత అధికారులు సంబంధించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

పర్యాటకులకు తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు వెళ్లేమార్గం మధ్యలో ఉన్న రైల్వేగేటువద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీనివల్ల పర్యాటకులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కేకేలైన్‌లోని ప్యాసింజర్, గూడ్స్ రైలు తిరుగుతుంటాయి. రైల్వేగేటు పడినప్పుడల్లా ట్రాఫిక్‌లో పర్యాటకులు చిక్కుకుంటున్నారు. పర్యాటక సీజన్‌లో శని, ఆదివారాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. పర్యాటకులు అధికసంఖ్యలో వాహనాల్లో తరలివస్తుంటారు. గేటు పడినప్పుడల్లా సమస్యలు ఎదుర్కొంటున్నారు. రైల్వే అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎటపాక జెడ్పీటీసీకి అరుదైన అవకాశం



శిక్షణలో పాల్గొన్న జెడ్పీటీసీ సుస్మిత

ఎటపాక: ఉన్నత విద్యావంతురాలైన జెడ్పీటీసీ ఉబ్బా సుస్మితకు అరుదైన అవకాశం లభించింది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డవలప్‌మెంట్ కార్యాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు ఆహ్వానం అందింది. పీసా చట్టం అమలులో ఉన్న పది రాష్ట్రాలకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే, ఐఏఎస్, ఐపీఎస్, డీఎల్‌పీవో, ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులకు కేంద్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ అందిస్తోంది. చట్టాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ మేరకు ఆమె శిక్షణ తరగతులకు హాజరయ్యారు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్ సస్పెన్షన్

రంపచోడవరం: దేవీపట్నం మండలం ముసినిగుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వార్డెన్ సత్యవతిని సస్పెండ్ చేసినట్లు డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు తెలిపారు. అలాగే హెచ్‌ఎం చంద్రకళను బూసిగూడెం బదిలీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదే ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినుల మృతి చెందడంతో వీరిపై చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దిగుడుపుట్టులో మశూచి వ్యాధి



మశూచి వ్యాధి సోకిన చిన్నారులు, మహిళ

హుకుంపేట: మండలంలోని దిగుడుపుట్టు గ్రామంలో తొమ్మిది మందికి మశూచి వ్యాధి సోకింది. గ్రామానికి చెందిన వంతాలకొండబాబు, కొర్ర రస్మి, గొర్రెల వరప్రసాద్, కొర్ర రాహుల్, తాంగుల జానకమ్మ, హర్ష వర్ధన్, శివసుమన్, మధుసూదన్ వ్యాధి బారిన పడ్డారు. వీరిలో ఎక్కువ మంది చిన్నారులు ఉన్నారు. వైద్యసిబ్బంది మందులు అందజేసినా వ్యాధి తీవ్రత తగ్గుముఖం పట్టడం లేదని గ్రామస్తులు తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలని వారు కోరుతున్నారు.

తేదీ : 1.02.2023
సమయం : తెల్లవారుజాము 4గంటలు
ప్రదేశం : దముకు సమీపంలోని మలుపు
ప్రాణనష్టం : ఒకరు



కర్ణాటకలోని కొల్లూరుకు చెందిన ముగ్గురు యువకులు విశాఖపట్నం నుంచి అరకు అందాలను తిలకించేందుకు మంగళవారం అద్దెకారు తీసుకుని డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చారు. పర్యాటక ప్రాంతాలల్లో అందాలను తిలకించారు. బుధవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం వెళుతుండగా అనంతగిరి మండలం దముకు సమీపంలోని మలుపువద్దకు వచ్చే సరికి అదుపుతప్పింది. లోయలోకి కారు దూసుకుపోయింది. ఈ ఘటనలో మురళీ అనే పర్యాటకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

తేదీ : 13.02.2023
సమయం : తెల్లవారుజాము 3-4 గంటల మధ్య
ప్రదేశం : కొదంగూడ మలుపు
ప్రాణనష్టం : ఒకరు



విశాఖ నగరంలోని సాగర్‌నగర్‌కు చెందిన ఎ.రాంబాబు తన స్నేహితుడితో కలిసి కారులో అరకు వచ్చారు. అందాలను తిలకించి, తెల్లవారుజామున మైదాన ప్రాంతాలకు వెళ్తుండగా అనంతగిరి మండలం కొదంగుడ గ్రామ సమీపంలోని మలుపు వద్ద కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో రాంబాబు మృత్యువాతపడ్డారు.

తేదీ : 19.02.2023
సమయం : తెల్లవారుజాము 4-5 గంటల మధ్య
ప్రదేశం : రాయపాడు మలుపు
ప్రాణనష్టం : ముగ్గురు



హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ దిగసల్తాంగి గ్రామానికి చెందిన బుట్టన్న, గణేష్, రాంబాబు మహాశివరాత్రి బొర్రా జాతరకు వచ్చారు. అక్కడ నుంచి లంగుపర్తి జాతరకు వెళ్లి, ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలోని నిమ్మలపాడు రోడ్డులో రాయిపాడు సమీపంలోని మలుపువద్ద రక్షణ గోడను ఢీకొట్టారు. లోయలోకి ఎగిరిపడడంతో ముగ్గురు సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.

ఆనంద క్షణాల్లో ఆదమరిస్తే..

మన్యంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు రోజూ వేల సంఖ్యలో వస్తుంటారు. సందర్శిత ప్రాంతాల్లో ప్రకృతి అందాలను తిలకిస్తూ ఆనందంగా గడుపుతుంటారు. సరదాగా గడిపిన క్షణాల్లో అజాగ్రత్త కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. తెల్లవారుజాము సమయంలో ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక పక్క మంచు.. మరోపక్క నిద్రమత్తే ఇందుకు కారణమని పోలీసులు చెబుతున్నారు.

- అందుకే ప్రమాదాలు
- నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతో గాలిలో కలిసి పోతున్న ప్రాణాలు
- తెల్లవారుజాము సమయంలోనే ఘటనలు
- నివారణపై పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



వాహన డ్రైవర్లకు ముఖం కడిగిస్తున్న అనంతగిరి పోలీసులు (ఫైల్)



ఘాట్‌రోడ్డులో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించలేనంతగా కురుస్తున్న పొగమంచు

అనంతగిరి: జిల్లాలోని అందాలను తిలకించేందుకు పర్యాటకులు కొంతమంది సొంత వాహనాల్లో, మరికొంతమంది ప్రైవేట్ వాహనాల్లో వస్తుంటారు. చిలకలగెడ్డ నుంచి అనంతగిరి మీదుగా అరకు లోయ వరకు ఘాట్ రోడ్డు కావడంతో వాహనం నడిపే వా రు చాలా అప్రమత్తంగా ఉండాలి. లేదంటే లోయలో పడిపోయే అవకాశం ఉంటుంది. మంచు దట్టంగా కురుస్తుంది. ఇరుకు రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని సందర్భాలు ఎదురవుతుంటాయి. ఈ సమయంలో అప్రమతంగా లేకపోవడం వల్లే ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవలే జరిగిన మూడు ప్రమాదాల్లో తెల్లవారుజామున ప్రయాణం.. పొగమంచు ఓ కారణం అయితే, మరోవైపు నిద్రమత్తుగా పోలీసులు భావిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న పోలీసుశాఖ

ప్రమాదాల నివారణపై పోలీసుశాఖ దృష్టి సారించింది. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. దీనిలో భాగంగా అరకు సీఐ దేముడుబాబు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేశారు. అరకు అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు తెల్లవారుజామున మైదాన ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు వారి వాహనాలు ఆపి, మోహం కడిగించి, ఘాట్‌రోడ్డు ప్రయాణంపై తగు సూచనలు చేసి పంపిస్తున్నారు.

విద్యార్థులు, యువతకు..

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురై కుటుంబాలకు దూరం అవుతున్నారు. అండగా ఉండాల్సిన వారే శోకం మిగులుస్తున్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల వద్ద విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలు అడిగారని, హైస్పీడ్ వాహనాలు కొనుగోలుచేసి ఇస్తున్నారు. వాళ్ల ఇష్టం వచ్చినట్లుగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు పోలీసుశాఖ సంకల్పించింది.

జీవితాలను నాశనం చేసుకోవద్దు



అందమైన జీవితాన్ని ప్రమాదాలకు గురై అర్థంతరంగా విడిచిపెట్టి వెళ్తున్నారు. వారిపై ఆధారపడిన తల్లి దండ్రులకు గర్భ శోకం మిగులుస్తున్నారు. వాహనాలు నడిపే మైనర్ల పైన, మితిమీరిన వేగంతో నడిపే వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

–దేముడుబాబు, అరకు సీఐ

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపు
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ



హాజరైన గృహ సారథులు, కన్వీనర్లు



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని విజయమే లక్ష్యంతో పనిచేయాలని పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం పరిధిలోని ఉరుము గ్రామంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు అధ్యక్షతన ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. అలాగే జగనన్న సందేశం, పార్టీ మెటీరియల్‌ను ప్రతి ఇంటికీ చేరవేయాలని గృహసారథులను కోరారు. సచివాలయం పరిధిలో నియమించిన ముగ్గురు కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.నియోజకవర్గం పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని దిగ్విజయంగా ముందుకు నడిపించేందుకు గృహసారథులు రథసారథులుగా వ్యవరించాల్సిన అవసరముందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఆయన కోరారు. గృహసారథులు, కన్వీనర్లకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్‌లను వారు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు,సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఏఎంసీ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ గాయత్రి, మండల కన్వీనర్ కల్యాణం, వైస్ చైర్మన్ నారాయణ, మైనారిటీ సెల్ జిల్లా కన్వీనర్ నాగూరు బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కీలక అభ్యర్థుల నామినేషన్లు

- భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలుకు తరలి వెళ్లనున్న వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్
- టీడీపీ, బీజేపీ మద్దతు అభ్యర్థులు కూడా..
- రేపటితో ముగియనున్న నామినేషన్ల పర్వం



ఏఆర్వో శ్రీనివాసమూర్తికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న స్వతంత్ర అభ్యర్థి చంద్రకళ పద్మావతి

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఆఖరి రోజు సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల మద్దతు అభ్యర్థులు నామినేషన్లకు వేసేందుకు బుధవారం సుముహూర్తంగా నిర్ణయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ భారీ ర్యాలీగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. టీడీపీ, బీజేపీ మద్దతు అభ్యర్థులు బుధవారమే నామినేషన్లు దాఖలు చేయనున్నారు. మంగళవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. జిల్లా సహాయ ఎన్నికల అధికారి, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తికి తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. కంచరపాలెంకు చెందిన బొడ్డేడ చంద్రకళ పద్మావతి, ఎంవీపీ కాలనీకి చెందిన కుందేటి సూర్య వెంకట సుభాష్ చంద్ర, శ్రీకాకుళం జిల్లా పొందూరుకి చెందిన ఎస్‌వీజే ప్రతాప్‌కుమార్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా ఇప్పటివరకు ఆరుగురు అభ్యర్థుల నుంచి 10 సెట్ల నామినేషన్లు అందాయి.

నేడు సీతంరాజు సుధాకర్ నామినేషన్

వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్ ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు. బుధవారం నామినేషన్ వేసేందుకు ముహూర్తం నిర్ణయించారు. కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ ముఖ్యనాయకులు, శ్రేణులతో కలిసి సంపత్‌వినాయక్ టెంపుల్‌లో ముందుగా పూజలు నిర్వహించి.. అక్కడి నుంచి భారీ ర్యాలీతో కలెక్టరేట్‌కు చేరుకొని నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదేవిధంగా.. టీడీపీ మద్దతు అభ్యర్థి చిరంజీవిరావు, బీజేపీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్ కూడా ర్యాలీగా బయలుదేరి నామినేషన్లను బుధవారం వేయనున్నట్లు ఆయా పార్టీ వర్గాలు వెల్లడించాయి. వీరితో పాటు టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్ల శ్రీరాములు కూడా నామినేషన్ దాఖలు చేయనున్నారు.

డోలీలో తరలించినా దక్కని శిశువు

- గర్భిణికి అత్యవసర వైద్యం
- తల్లి ప్రాణాలను కాపాడిన సిబ్బంది
- నెలలు నిండకపోవడమే కారణం



మృతి చెందిన శిశువు

హుకుంపేట: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఎంతో కష్టపడి డోలీలో ఆస్పత్రికి తరలించినా నెలలు నిండకపోవడంతో శిశువు ప్రాణాలు దక్కలేదు. తల్లి ప్రాణాలను మాత్రమే వైద్యసిబ్బంది కాపాడగలిగారు. వివరాలిలావున్నాయి. మండలంలో మారుమూల కొండప్రాంతమైన తీగలవలస పంచాయతీ పనసబంద గ్రామానికి చెందిన వంతాల భానుకు మంగళవారం పురిటినొప్పులు మొదలయ్యాయి. దీంతో భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. రహదారి లేనందున వాహనం గ్రామానికి వెళ్లలేదు. దీంతో కుటుంబసభ్యులు పనసబంద నుంచి డోలీలో తీగలవలస గ్రామం వరకు తీసుకువచ్చారు. అక్కడినుంచి ఆటోలో స్థానిక ఆస్పత్రికి తీసుకువచ్చారు. పురిటి నొప్పులు ఎనిమిదో నెలలో వచ్చినందున బిడ్డం అడ్డం తిరగడంతో వైద్యసిబ్బంది అతికష్టంమీద ప్రసవం చేశారు. అప్పటికే మృతి చెందిదని వైద్యసిబ్బంది తెలిపారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేనందున అంబులెన్సు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా సమస్యను గుర్తించి అధికారులు రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తుల, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు కోరారు.



పనసబంద గ్రామం నుంచి గర్భిణిని డోలీలో మోసుకొస్తున్న కుటుంబ సభ్యులు,గ్రామస్తులు

శిశు మరణాలకు బాధ్యత వహించాల్సిందే

కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్రంలో ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: జిల్లాలో శిశు మరణాలు సంభవిస్తున్నందున వాటికి వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ,ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పీహెచ్‌సీల వారీగా మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలను ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్ వేయకపోవడం, తల్లిపాలు అందించడంపై బాలింతలకు అవగాహన లేకపోవడం తదితర అంశాలు అనారోగ్య పరిస్థితులకు దారితీస్తున్నాయన్నారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆశా కార్యకర్త నెలలో నాలుగు సార్లు బాలింతల ఇంటికి వెళ్లాలని, బిడ్డలకు ఆరోగ్య సేవలు,తల్లిపాలు ఇవ్వడం ,తల్లిపాలు పట్టే విధానం, తల్లిపాలు లేకపోతే ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రంపచోడవరం పరిధిలో గత నాలుగేళ్లగా ఈ కార్యక్రమాలు నిరంతరం విజయవంతంగా చేపట్టడం వల్ల మాతాశిశుమరణాలు చాలా తక్కువగా నమోదయ్యాయన్నారు. అనవసరంగా విశాఖ కేజీహెచ్‌కు కేజీహెచ్‌కు రిఫర్ చేయడం సరికాదన్నారు. అలాంటి పరిస్థితులు చోటుచేసుకుంటే సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.సీడీపీవోలు, వైద్యులు గ్రామాల్లో పర్యటించి శిశు మరణాల పట్ల అప్రమత్తం కావాలన్నారు. నాటు మందులతో చనిపోతే వాటికి మందు ఇచ్చే నాటు వైద్యుడు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ మాట్లాడుతూ గర్భిణులను గుర్తించి నెలవారీ వైద్యపరీక్షలతో పాటు స్కానింగ్ చేయాలని సూచించారు. నెలలు నిండిన గర్భిణులను ముందుగానే బర్త్ వెయిటింగ్ వార్డులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఏఎన్‌ఎం శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో డాక్టర్ జమిల్‌బాషా, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు



మాట్లాడుతున్న పీవో సూరజ్‌గానోరే -8లో

అన్ని రంగాల్లో రాణింపుతో భవిష్యత్తు

గూడెంకొత్తవీధి: విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ కమాండెంట్ వీరేంద్ర కుమార్, సీఐ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, గూడెం కాలనీ, కొత్తూరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా కిట్లు, పుస్తకాలు, పెన్నులు, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం ఎంతో ఉందని, అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం అందించే సాయంతో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఎస్‌ఐ అప్పలసూరి పాల్గొన్నారు.



క్రీడా కిట్లు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ వీరేంద్ర కుమార్, సీఐ ఆశోక్ కుమార్

క్లుప్తంగా

జాతర ఏర్పాట్లు పరిశీలన

మోతుగూడెం: ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్‌తో పాటు ఒడిశా ఉన్నతాధికారులు బృందం మంగళవారం పొల్లూరు జలపాతాన్ని సందర్శించారు. ఈ నెల 27న జరిగే మస్యంకొండ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. సీలేరు నది దాటే ప్రదేశంతో పాటు వనదేవతలు స్నానాలు చేయించే వాటర్ పాల్స్‌ను సందర్శించారు. ఆయన వెంట ఒడిశా పోలీసులు, రెవెన్యూ విభాగం యంత్రాంగం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

108లో సుఖ ప్రసవం

జి.మాడుగుల: పురుటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలో బొయితిలి పంచాయతీ బూసులకోట గ్రామానికి చెందిన లవిడి కుమారికి మంగళవారం మధ్యాహ్నం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే గ్రామానికి చేరుకొని వాహనంలో గర్భిణిని తరలిస్తుండగా మార్గమధ్యలో వాకపల్లి రోడ్డుకు వచ్చేసరికి ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎన్‌టీ శ్రీను తెలిపారు. వారిని పాడేరు జిల్లా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన రాహులు

చింతపల్లి రూరల్: కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహన దారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాలివి. చౌడుపల్లి గ్రామానికి చెందిన కొరాబు రాహులు ద్విచక్ర వాహనంపై చింతపల్లి నుండి చౌడుపల్లి వెళ్తుండగా కాఫీ బోర్డు కార్యాలయం ఎదుట అటుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో అతనికి కుడి కాలు విరిగిపోయింది. దీంతో అక్కడ ఉన్న స్థానికులు హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తీసుకురాగా అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్ఐ రమణ తెలిపారు.

వైభవంగా గంగమ్మ తల్లి ఉత్సవాలు

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు



ఘటాలను తీసుకొస్తున్న భక్తులు, జెడ్పీ చైర్ పర్సన్



సుజనకోట గంగమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

ముంచంగిపుట్టు: మండలంలోని పాత,కొత్త సుజనకోట గ్రామాల్లో గంగమ్మతల్లి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సోమవారం రాత్రి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర,ఆమె భర్త నర్సింహమూర్తిలతో పాటు అధికసంఖ్యలో భక్తులు శతకం పట్టు నుంచి అమ్మవారి ఆలయం వరకు ఘటాలను తీసుకువెళ్లి సమర్పించారు. రాత్రి బుడియాలు సందడి చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జాము నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జి.మాడుగుల సీఐ సత్యనారాయణ గస్తీ ఏర్పాటు చేశారు. ముంచంగిపుట్టు కిరాణా వ్యాపారులు గుడ్ల వెంకటరావు, శ్రీనివాసరావులు ఐదు వేల మందికి ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర,అరకు,పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ,కొట్టగొళ్లి భాగ్యలక్ష్మిలు పాత,కొత్త సుజనకోట గ్రామాల్లో గంగమ్మ అమ్మవారులను దర్శించుకుని, సారె సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.స్థానిక సర్పంచ్ రమేష్,ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి,ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు,మోహన్,కమిటీ సభ్యులు,గ్రామస్తులు జెడ్పీ చైర్ పర్సన్, అరకు,పాడేరు ఎమ్మెల్యేలను దుశ్శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ముఖ్య కార్యదర్శి చెట్టి వినయ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ,పెదబయలు జెడ్పీటీసీ సభ్యురాలు బొంజుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్,వైస్ఎంపీపీ భాగ్యవతి,సర్పంచ్‌లు నీలకంఠం,గంగాధర్, సురేష్, భాగ్యవతి,ఎంపీటీసీ కమల తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర,ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మిలను సన్మానిస్తున్న సర్పంచ్,ఎంపీటీసీ

అర్హులందరికీ రుణాలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని అర్హులైన యువతీ యువకులకు చిన్న పరిశ్రమలశాఖ ద్వారా రుణాలు మంజూరు చేస్తామని స్థానిక ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు చెందిన బ్యాంకు మేనేజర్లతో ఏపీఎంలు, డీపీఎంలు, దరఖాస్తుదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 8వ తరగతి ఆపై చదువుకున్న యువతీ యువకులు దరఖాస్తు చేసుకుంటే బడుగు వికాసం, పీఎంఈజీపీ పథకంలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. దరఖాస్తుదారులు సివిల్ స్కోర్ ఆధారంగా రాయితీపై రుణాలు మంజూరు చేస్తామన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత బ్యాంకు మేనేజర్లను సంప్రదించాలని కోరారు. ఏర్పాటుచేయనున్న యూనిట్లకు సంబంధించి జీఎస్టీ ధ్రువ పత్రం ఉన్నవారి దగ్గర నుంచి మాత్రమే కొటేషన్లు తీసుకురావాలని కోరారు. దరఖాస్తుదారుల్లో శిక్షణ పొందిన వారికి మాత్రమే రాయితీ వర్తిస్తుందని చెప్పారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తులు, మంజూరైన రుణాలకు సంబంధించిన వివరాలను ఆయన తెలుసుకున్నారు. రుణాల మంజూరుకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని బ్యాంక్ మేనేజర్లను ఆయన కోరారు. ఈ సమావేశంలో చిన్న పరిశ్రమల శాఖ ప్రాజెక్ట్ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రవితేజ, బ్యాంకు మేనేజర్లు యం. శ్రీనివాసరావు. రాజ్ కిషోర్, డీపీఎంలు పరమేశ్వరరావు, అప్పర్ణ, పీఎంఈజీపీ యాంకర్ పర్సన్ రామరాజు, ఏపీఎంలు అప్పారావు, శ్యామ్‌కుమార్, జేమ్స్, సూరమ్మ, రాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిండు గర్భిణికి కౌన్సెలింగ్

- ఎట్టకేలకు ఆస్పత్రికి తరలింపు
- సుఖ ప్రసవంతో తల్లీబిడ్డల క్షేమం

సీలేరు: పురిటి నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రిలో ప్రసవానికి నిరాకరించిన నిండు గర్భిణికి కౌన్సెలింగ్ నిర్వహించి, పీహెచ్‌సీకి తరలించడంతో ఆడ శిశువుకు జన్మనిచ్చిందని సీలేరు ఆస్పత్రి వైద్యాధికారి మస్తాన్ వలీ, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గూడెంకొత్తవీధి మండలం గాలికొండ గ్రామానికి చెందిన గొల్లూరు దేవి రెండు రోజుల నుంచి పురిటినొప్పులతో బాధపడుతోంది. కుటుంబసభ్యులు నచ్చజెప్పినా ఆమె ఆస్పత్రికి వెళ్లేందుకు నిరాకరించింది. దీంతో ఆమె బంధువులు వైద్యసిబ్బందికి సమాచారం అందించారు. పోలీసులు, వైద్యులు ఆమెకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆస్పత్రి నుంచి రప్పించిన అంబులెన్సులో ఆమెను ఆస్పత్రికి తీసుకురావడంతో వైద్యులు కాన్పు చేశారు. ఆమె ఆడశిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్

అడ్డతీగల: చేపల పెంపకంతో గిరిజన మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని మత్స్యశాఖ రంపచోడవరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ తెలిపారు. మంగళవారం అడ్డతీగల వచ్చిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.రంపచోడవరం,చింతూరు డివిజన్లలో వ్యక్తిగత చెరువులు కలిగిన గిరిజన రైతులతో పాటు జలాశయాల్లో చేపల పెంపకం చేపట్టిన మత్స్యకార సహకార సంఘాలకు ఈ ఏడాది చేప పిల్లలు విరివిగా పంపిణీ చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం 75 శాతం రాయితీతో అందజేస్తున్నట్టు తెలిపారు.రంపచోడవరం మండలం పందిరిమామిడి, రాజవొమ్మంగి మత్స్యక్షేత్రాల నుంచి 8 లక్షల పింగర్లింగ్స్(80 నుంచి 100 మిల్లీమీటర్లు పొడవు కలిగిన చేప పిల్లలు)ను 342 మందికి వ్యక్తిగతంగా అందజేశామన్నారు. రంపచోడవరం డివిజన్‌లోని ఐదు జలాశయాలకు చెందిన మత్స్యకార సహకార సంఘాలకు 5.60 లక్షల చేప పిల్లలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా ఆసక్తి కలిగిన లబ్ధిదారులకు 60 శాతం రాయితీతో బ్యాంకు రుణం ద్వారా మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు మంజూరు చేస్తామన్నారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద చేపల రవాణా వాహనాలను కూడా 60 శాతం రాయితీపై అందజేస్తామన్నారు. గిరిజనేతరులకు 40 శాతం రాయితీ వర్తిస్తుందని చెప్పారు. ఇంతకుముందులా ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేసే విధానం అమల్లోకి తీసుకురావాలని గిరిజన మత్స్యకార సంఘాలు కోరుతున్నట్టు ఆయన తెలిపారు.

ఎంఎల్ఎస్ గొడౌన్‌లో తనిఖీలు



జడ్డంగి ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న సివిల్‌సప్లై అధికారులు



రంపచోడవరం సచివాలయాన్ని సందర్శించిన శివప్రసాద్

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి మండల లెవెల్ స్టాక్ పాయింట్(ఎంఎల్ఎస్) గొడౌన్‌ను సివిల్‌సప్లై జిల్లా అధికారి శివప్రసాద్, మేనేజర్ గణేష్‌కుమార్‌లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల అమీనాబాద్‌కాలనీ వద్ద అక్రమంగా తరలిపోతున్న పీడీఎస్ బియ్యం పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ బియ్యాన్ని ప్రత్యేకంగా నిల్వ చేయాలని గొడౌన్ సిబ్బందిని ఆదేశించారు. గొడౌన్‌కు చేరుకొన్న తాజా కందిపప్పు నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గొడౌన్‌లో గల ఇతర నిత్యావసర సరకుల నాణ్యత, రికార్డులు పరిశీలించారు.

రాగి పిండి, బెల్లం సరఫరా

జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందజేసే రాగి జావ కోసం అవసరమైన రాగి పిండి, బెల్లాన్ని జడ్డంగి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరఫరా చేయనున్నట్టు సివిల్‌సప్లై జిల్లా అధికారి శివప్రసాద్ తెలిపారు.ఈ నెల నుంచి బియ్యం కార్డులపై కిలో కంది పప్పు, కిలో గోధుమ పిండి అందజేస్తున్నట్టు చెప్పారు.రంపచోడవరం ఎంఎల్ఎస్ పాయింట్, రంపచోడవరం పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేసినట్టు వారు చెప్పారు.

వీఆర్‌వోలదే కీలక పాత్ర

రంపచోడవరం: ప్రజా పంపిణీ వ్యవస్థలో వీఆర్‌వోలదే కీలక పాత్ర అని జిల్లా సివిల్ సప్లై అధికారి పి.శివప్రసాద్ అన్నారు. రంపచోడవరం సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల్లో రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూదని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

మళ్లీ తెరపైకి చింతపల్లి ట్రెజరీ కుంభకోణం కేసు

విచారణ చేపట్టిన డిప్యూటీ డైరెక్టర్ శేషారెడ్డి

మహారాణిపేట (విశాఖ): వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల పేరిట దొంగ బిల్లులు పెట్టి నిధులు కాజేసిన చింతపల్లి ట్రెజరీ కుంభకోణం కేసు మళ్లీ తెరమీదకు వచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శేషా రెడ్డి శాఖాపరమైన విచారణ చేపడుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్టు ఉద్యోగుల పేరిట 2013 నవంబర్‌లో దొంగ బిల్లులు పెట్టి సుమారు రూ.13 కోట్లు స్వాహా చేశారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పెట్టిన బిల్లులను ట్రెజరీ అధికారులు ఆమోద ముద్ర వేసి మొత్తం నిధులను దోచుకున్నారు. ఈ వ్యవహారం 2015లో వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో రెండు శాఖలతోపాటు ఈ కేసుతో సంబంధం ఉన్న ఇతర అధికారులు మొత్తం 83 మందిపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందులో కొంత మందిపై వేటు వేశారు. మరికొందరు రిటారయ్యారు. ఇంకొందరు మళ్లీ పోస్టింగులు తెచ్చుకున్నారు. ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు మరణించారు. అయితే రికవరీ ఏ మాత్రం జరగలేదు. సుదీర్ఘ విరామం తర్వాత వైద్య ఆరోగ్యశాఖ మళ్లీ ఈ కేసు విచారణ ప్రారంభించింది. డిప్యూటీ డైరెక్టర్ శేషారెడ్డి అప్పటి డీఎంహెచ్‌వో శ్యామల, పాడేరు అడిషనల్ డీఎంహెచ్‌వో స్వప్నకుమారి, డాక్టర్ మురళీమోహన్ రావు, విశ్రాంత ఏవో శ్రీనివాస్, సిబ్బంది నిర్మల తదితరులను విచారించారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. మరో రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

పెదపేటలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

- మైనింగ్ అధికారుల దాడి
- రెండు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్ సీజ్



పెదపేట భూముల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం



సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన వాహనాలు

రోలుగుంట: మండలంలోని పెదపేట సమీపంలో జరుగుతున్న అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలపై అనకాపల్లి మైనింగ్ అధికారులు సోమవారం అర్ధరాత్రి దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడున్న ఒక పొక్లెయిన్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వివరాలివి. ఎం.కె. పట్నం శివారు పెదపేట సమీపంలో 37-3 సర్వే నంబర్‌లో గల సుమారు మూడు ఎకరాల జిరాయితీ భూమిలో అనధికారికంగా మట్టిని తవ్వి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు చేసుకొని కాసులు చేసుకుంటున్నారు. స్థానికులు దీనిపై సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ వెంకటేశ్వర రావు ఆదేశాలతో వీఆర్వో రాజలమ్మ అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలపై నివేదిక తయారు చేసి మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్ అధికారులు సోమవారం అర్ధరాత్రి దాడి జరిపి తవ్వకాల ప్రాంతంలో వాహనాలను సీజ్ చేశారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైనింగ్ ఏడీఏ ఎ.జి.రవివర్మ విలేకరులతో మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలపై కేసు నమోదు చేశామన్నారు. రెవెన్యూ అధికారులలో ఈ విషయమై చర్చించి అపరాధ రుసుము వసూలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే భూ యజమానిని కూడా విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

సింహాచలం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో పలు విభాగాలకు సంబంధించి అధికారులు, సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో వి.త్రినాథరావు ఉత్తర్వులు జారీ చేశారు. శానిటేషన్ విభాగంగా ఉన్న ఏఈవో ఎస్.ఆనందకుమార్‌ను ఆలయ ఏఈవోగా నియమించారు. ఆలయ ఏఈవోగా ఉన్న నరసింహరాజును ప్రసాదాలు, అన్నదాన విభాగం ఏఈవోగా బదిలీ చేశారు. లీజెస్ సెక్షన్, గోశాల సూపరింటెండెంట్ జి.అప్పలనాయుడును ఆలయ ఫైల్స్ కరస్పాండెన్స్, సింహగిరిపై క్యాష్ కౌంటర్ల పర్యవేక్షకుడిగా నియమించారు. ఆలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పిల్లా శ్రీనివాసరావు లీజెస్ సెక్షన్, గోశాల పర్యవేక్షకుడిగా బదిలీ చేశారు. గోశాల, నేచురోపతి ఆస్పత్రి సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.సూర్యనారాయణను సీ8, సీ9 సెక్షన్లకు సీనియర్ అసిస్టెంట్‌గా, అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన సీనియర్ అసిస్టెంట్ పల్లి సూరిబాబును గోశాల, నేచురోపతి ఆస్పత్రికి సీనియర్ అసిస్టెంట్‌గా విధులు కేటాయించారు. ఆలయ నైట్ డ్యూటీలో మాలీగా పనిచేస్తున్న కర్రి సత్యారావును ల్యాండ్ ప్రొటెక్షన్‌కు, ల్యాండ్ ప్రొటక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న బోర శివారెడ్డిని విజయనగరంలోని ఎస్‌బీ హౌస్‌కు బదిలీ చేశారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఎల్‌డీ గ్యాస్ హోల్డర్-2 ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మరమ్మతులు చేసిన ఎల్‌డీ గ్యాస్ హోల్డర్-2 ను డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ మంగళవారం ప్రారంభించారు. స్టీల్ మెల్ట్ షాప్‌ల ఎల్‌డీ కన్వర్టర్ల నుంచి బ్లోయింగ్ సమయంలో ఉత్పత్తి చేసే గ్యాస్‌ను నిర్వహించడానికి రెండు గ్యాస్ హోల్డర్లు ఏర్పాటు చేశారు. ఈ ఎల్‌డీ గ్యాస్ హోల్డర్‌లో ఉండే గ్యాస్ ఆరు రోలింగ్ మిల్లుల్లోని ఫర్నేస్‌ల ఇంధన అవసరాన్ని తీరుస్తుంది. అదే విధంగా టీపీపీ విభాగంలోని బాయిలర్లలోనూ ఉపయోగించబడుతుంది. రూ. 20 కోట్లతో చేపట్టిన మరమ్మతుల అనంతరం ప్రారంభోత్సవం నిర్వహించారు.

గ్యాస్ హోల్డర్‌ను తిరిగి ప్రారంభించడంలో ముఖ్య పాత్ర వహించిన ఉక్కు సిబ్బందిని డైరెక్టర్ బాగ్చీ అభినందించారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) డి.కె. మహంతి, సీజీఎం (ప్రాజెక్ట్స్) ఇన్‌చార్జ్ బాపారావు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న ధర్మిత తల్లిదండ్రులు, గ్రామస్తులు

హుకుంపేట: ఉర్రడా బొడ్డాపుట్టు ఎంపీపీ పాఠశాలలో ఇటీవల విద్యుత్ స్తంభం పడి విద్యార్థిని ధర్మిత మృతి చెందిన ఘటనలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఈ ఘటనకు బాధ్యులైన ముగ్గురిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటించారని చెప్పారు. అయితే ఇంతవరకు ఎవరిపైనా చర్యలు తీసుకోలేదని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను కోరారు.

బావిలోకి దూకి వృద్ధుడి ఆత్మహత్య



నూకరాజు మృతదేహం

యలమంచిలి: భార్య చనిపోయిందని మనస్థాపంతో వృద్ధుడు బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. యలమంచిలి పట్టణ అడిషినల్ ఎస్ఐ కె.వెంకటరావు తెలిపిన వివరాలివి. యలమంచిలి పట్టణంలో గాంధీనగర్ వీధికి చెందిన కొత్తలంక నూకరాజు భార్య ఇటీవలే మరణించడంతో మనస్థాపం చెంది మంగళవారం ఉదయం తన ఇంటి సమీపంలో ఉన్న బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు స్థానిక అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం తెలపగా వారు హుటాహుటిన వచ్చి సహాయక చర్యలు చేపట్టి నూకరాజు మృతదేహాన్ని వెలికి తీసి బంధువులకు అప్పగించారు. మృతుడు నూకరాజుకు నలుగురు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు. మూడవ కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మార్చురీలో వృద్ధుడి మృతదేహం



కృష్ణ మృతదేహం

నర్సీపట్నం: మున్సిపాలిటీ కృష్ణాబజార్ మద్యం దుకాణానికి సమీపంలో మృతి చెంది ఉన్న వృద్ధుడు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచామని టౌన్ సీఐ ఎస్.గణేష్ తెలిపారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 72 ఏళ్లు ఉంటుందన్నారు. వృద్ధుడి వద్ద లభించిన ఆధార్‌కార్డులో అతని వివరాలు చింతపల్లి మండలం, లోతుగెడ్డ గ్రామానికి చెందిన కటుమోహన్ కృష్ణగా ఉందన్నారు. బంధువుల కోసం విచారణ చేస్తున్నామన్నారు. బంధువులు ఎవరైనా వస్తే మృతదేహాన్ని అప్పగిస్తామన్నారు.

25న దుబాయ్‌లో శత వసంత కళా వైభవం



వివరాలు వెల్లడిస్తున్న ఆచార్య లక్ష్మీ ప్రసాద్

ఏయూ క్యాంపస్: కేంద్ర సాంస్కృతిక శాఖ, తెలంగాణ పర్యాటక కార్పొరేషన్, దుబాయ్ తెలంగాణ సొసైటీ సహకారంతో ఈ నెల 25న దుబాయ్‌లో మహానటుడు ఎన్టీఆర్, అమరగాయకుడు ఘంటశాల వెంకటేశ్వరరావుల శత జయంతి కళా వైభవం ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. మంగళవారం ఏయూ హిందీ విభాగంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కళ, కళయిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. సినీ నటుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు ఎన్టీఆర్ అంతర్జాతీయ పురస్కారాన్ని, స్వాతి పత్రిక సంపాదకుడు వేమూరి బలరామ్‌కు ఎన్టీఆర్-ఘంటశాల అంతర్జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు చెప్పారు. ఘంటశాల కోడలు, ప్రముఖ భరతనాట్య కళాకారిణి ఘంటసాల పార్వతి, ప్రముఖ గాయకుడు చంద్రతేజలకు ఘంటశాల అంతర్జాతీయ పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. మహా నాయకుడు ఎన్టీఆర్, మన ఘంటసాల పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాలకు డాక్టర్ మహ్మద్ రఫీ, చేరాల నారాయణ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారన్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు నుంచి 100 మందికి పైగా కళాకారులు ఇందులో పాల్గొంటున్నారని చెప్పారు.